క్లుప్తంగా

పత్తి కొనుగోలు నేటి నుంచి

కొడంగల్: కొడంగల్ రావులపల్లి జాతీయ రహదారిపై నీటూరు గేటు సమీపాన ఉన్న విజయ్ పత్తి మిల్లులో సోమవారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పత్తిని విక్రయించాలని సూచించారు.

నేటి నుంచి నరేందర్‌రెడ్డి ప్రచారం

బొంరాస్‌పేట: సాధారణ ఎన్నికల్లో భాగంగా కొడంగల్ అభ్యర్థుల ప్రచారం నేటి నుంచి ప్రారంభం కానుంది. బీఫారం అందుకున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి.. సోమవారం నుంచి నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. అందుకు వాస్తు ప్రకారం మండలంలోని మదన్‌పల్లిలో ముహూర్తం చేయనున్నారు. కార్యక్రమానికి మంత్రి మహేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 10గంటలకు మదన్‌పల్లి, మదన్‌పల్లితండా, బురాన్‌పూర్, సూర్యానాయక్‌తండా, కుబ్యానాయక్‌తండా, గట్టిగానితండా, టేకులగడ్డతండాలో ప్రచారం నిర్వహించనున్నారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా హన్మంతు



పరిగి: బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా హన్మంతు ముదిరాజ్‌ను జాతీయ నాయకత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హన్మంతుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఇందులో సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, బుజ్జి కృష్ణ ఉన్నారు.

రోడ్డుకు అడ్డుగా రాళ్లు

మోమిన్‌పేట: వాహనాల వేగ నియంత్రణకు రోడ్డుకు అడ్డుగా రేడియంతో కూడిన ఇనుప బారీకేడ్లు, డ్రమ్ములను ఏర్పాటు చేస్తారు. కానీ మేకవనంపల్లి పోలీస్ చెక్ పోస్టు వద్ద రాళ్లు, కర్రలు పెట్టారు. దీంతో పలువురు వాహన చోదకులు మాట్లాడారు. ఇలా రాళ్లు పెట్టడం వలన రాత్రి వేళలో అవి కనిపించక ప్రమాదాలు జరుగుతాయని, రేడియంతో కూడిన బారీకేడ్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

తాండూరు: యాదవుల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని యాదవ సంఘం తాండూరు నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో యాదవులో నిర్వహించిన సమావేశంలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. అనంతరం యాదవ సంఘం తాండూరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నర్సింగరావు, మల్లేశం, అధ్యక్షుడిగా రాజుయాదవ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బస్వరాజ్, సహాయ కార్యదర్శిగా అంజయ్య యాదవ్, కోశాధికారిగా లాలప్ప ఎన్నికయ్యారు.

ఏ-ఫారం, బీ-ఫారం అంటే?

వికారాబాద్ అర్బన్: ఎన్నికల సమయంలో తరచుగా ఏ-ఫారం, బీ-ఫారం పేర్లు వింటుంటాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులు అభ్యర్థులకు రావాలంటే వీటి అవసరం ఉంటుంది. అవి ఏమిటో ఎలా ఇస్తారో తెలుసుకుందాం.

ఏ-ఫారం అంటే..

పార్టీ తన అభ్యర్థిగా ఎవరినైతే ఎంపిక చేస్తుందో వారికి బీ-ఫారం అందజేస్తుంది. బీ-ఫారం అందించే వ్యక్తికి ముందుగా ఇచ్చేది ఏ ఫారం. ఎవరిని పార్టీ ఎంపిక చేసి ఏ-ఫారం అందజేస్తుందో వారికి మాత్రమే బీ-ఫారం ఇస్తారు. ఏ-ఫారం అందుకున్న పార్టీ అభ్యర్థి ముందుగా తనకు లభించిన ఏ-ఫారంను ఎన్నికల అధికారులకు అందజేస్తారు.

బీ-ఫారం అంటే..

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరేనని గుర్తించేలా ఇచ్చేదే బీ-ఫారం. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల అధికారులకు ఈ ఫారాన్ని దాఖలు చేస్తేనే పార్టీకి సంబంధించి ఎన్నికల గుర్తును సదరు అభ్యర్థికి కేటాయిస్తారు. పార్టీ అధ్యక్షుడు, ప్రత్యేకంగా నియమితులైన ప్రతినిధుల ద్వారా బీ-ఫారాన్ని అందజేస్తారు.

ఆత్మీయ సమ్మేళనం

కేశంపేట: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలని వారు తీర్మానించారు. బీఆర్‌ఎస్ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, మళ్లీ కొత్త హామీలతో ప్రజల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తాయన్నారు. ఇందులో రఘురాంగౌడ్, మోటే శ్రీను, చిల్వేరు లింగయ్య, సొప్పరి నర్సింహ, శివాజీ, కంచుకోట నర్సింహ ఉన్నారు.

కాగితాల్లోనే మొక్కల లెక్క

- నీరుగారుతున్న హరితహారం
- నర్సరీ నిర్వహణపై నిర్లక్ష్యం
- గుంతల పక్కనే మొక్కల పడవేత
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

పెద్దేముల్: తెలంగాణను పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం.. తలపెట్టిన హరితహారం కార్యక్రమం నీరుగారిపోతోంది. మొక్కల సంరక్షణకు పాటుపడాల్సిన అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మొక్కలు మొగ్గలోనే భూస్థాపితం అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మొక్కలు నాటించడం వరకే పరిమితమయ్యారన్న విమర్శలొస్తున్నాయి. మండల పరిధి పంచాయతీల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించి, వాటిని నాటకుండా పడేస్తున్నారని, గుంతలు తీయడం, మొక్కలు నాటడం లాంటివి కాగితాలకే పరిమితం అవుతున్నట్లు సమాచారం. తద్వారా సర్కారు లక్ష్యం నిర్లక్ష్యం కావడంతో పాటు, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

గుంతల పక్కన మొక్కలు

పెద్దేముల్ మండలం 37 గ్రామ పంచాయతీల్లో హరితహారం కింద లక్షా 66వేల 500 మొక్కలు నాటాలని ప్రభుత్వం టార్గెట్ చేయగా.. లక్షా 9వేల 910 మొక్కలు నాటినట్లు అధికారులు లెక్కలు చూపెడుతున్నారు. అంతే కాకుండా.. రూ.200 చొప్పున మూడున్నర నుంచి నాలుగు ఫీట్ల మొక్కలను రాజమండ్రి నుంచి ఖరీదు చేసి, ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటించి, వాటి సంరక్షణ మరవడంతో కొన్ని చచ్చిపోయాయని, మరి కొన్ని ఎండిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ మండల ఖాజాపూర్ నుంచి ప్రధాన రోడ్డు హైదరాబాద్ లింక్ రోడ్డుకు ఇరువైపులా ఉపాధి కూలీలతో గుంతలు తవ్వించారు. కానీ తవ్వించిన గుంతల్లో మొక్కలు నాటకుండా వాటిని పక్కన పడేశారు.



రోడ్డు పక్కన నాటకుండా వదిలేసిన మొక్కలు

మెమోలు ఇస్తాం...



నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు వంద శాతం సంరక్షించేలా చర్యలు తీసుకుంటాం. రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోతే సంబంధిత వారికి మెమోలు జారీ చేస్తాం. ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తాం. మొక్కల పెంపకం కోసం ప్రభుత్వం అనేక నిధులు వెచ్చిస్తోంది. నిర్లక్ష్యం ఎవరిది ఉంటే వారి వేతనాల్లో కోతపెట్టడంతో పాటు, మెమోలు ఇస్తాం. కొందరు జీపీ కార్యదర్శులు విధులకు సక్రమంగా రావడం లేదని తెలుస్తోంది. విచారణ చేపడుతాం.

– లక్ష్మయ్య, ఎంపీడీఓ, పెద్దేముల్ మండలం

ఒక్కో మొక్కకు ఏడు రూపాయలు

నర్సరీల నిర్వహణ నిర్లక్ష్య ప్రభావం మొక్కల పెంపకంపై పడింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన అనేక నిధులు వృథా అవుతున్నాయని, వాటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీ, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. ఒక్కో మొక్క పెంచేందుకు ప్రభుత్వం సుమారు రూ.7 పైగా నిధులు వెచ్చిస్తున్నా.. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు, నాటుతున్న వాటికి పొంతన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యారంగాన్ని మరిచిన ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

- అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలం
- ప్రజా సంక్షేమమే ప్రధాని లక్ష్యం
- దేశానికి సుపరిపాలన అందిస్తున్న మోదీ
- ఎన్నికల సమాయత్త సమీక్షలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి
- ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించాలని నేతల పిలుపు

తాండూరు టౌన్: 'తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. విద్యారంగాన్ని విస్మరించింది. అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయింది. అందుకు నిదర్శనం దేశంలో 31వ స్థానంలో నిలవడమే.. దీన్ని బట్టే అర్థమవుతోంది విద్యాభివృద్ధికి ఆ పార్టీ ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో' అని మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం స్థానిక గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ ఎన్నికల సమాయత్త సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారని, దేశానికి సుపరిపాలనను అందిస్తున్నారని చెప్పారు. దేశాన్ని పరిపాలించిన గత ప్రభుత్వాలన్నీ ఏదో ఒక స్కాంలో ఇరుక్కున్నాయని, కానీ మోదీ పాలనలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని పేర్కొన్నారు.

రెండు పార్టీలూ ఒక్కటే..

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకతకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌ను ఓడించాలని, బీజేపీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. తాండూరు నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిందేమీ లేదని, కేవలం శిలాఫలకాలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, గులాబీని గెలిపించుకునేందుకు ఇరు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని ఆరోపించారు. ప్రజలు ఇలాంటి వారిని నమ్మొద్దని, రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత, కౌన్సిలర్లు లలిత, బాలప్ప, నాయకులు భద్రేశ్వర్, శివకుమార్, రమ్యానాయక్, అన్ని మండలాల, పట్టణ ముఖ్య కార్యకర్తలు, మహిళా మోర్చా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శైలపుత్రి అవతారంలో దుర్గామాత



అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో శైలపుత్రి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు



తాండూరు టౌన్: పూజలో పాల్గొన్న వాసవీ మహిళా సంఘం సభ్యులు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు, మండపాలు

అనంతగిరి: దేవీ నవరాత్రులు పురస్కరించుకుని తొలి రోజైన ఆదివారం దుర్గామాత.. శైలపుత్రి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వికారాబాద్‌లోని వైభవలక్ష్మి ఆలయం, రాంమందిరం, శివారెడ్డిపేటలోని తుల్జాభవానీ మాత, మల్లికార్జున స్వామి ఆలయాలతో పాటు పలు వాడల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో భాగంగా అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులు, లలిత సహస్రనామ పారాయణం గావించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

తాండూరు టౌన్‌లో..

తాండూరు టౌన్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాండూరు పట్టణం పలు వార్డులు, దేవాలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయిపూర్, ఇందిరానగర్, శ్రీనగరేశ్వర దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయిపూర్‌లోని బోనమ్మ దేవాలయంలో కౌన్సిలర్ నీరజ దంపతులు పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు కొలువుదీరిన శ్రీ నగరేశ్వర దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం, నగరేశ్వర దేవస్థాన పాలకమండలి ఆధ్వర్యంలో ఘటస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఇందులో వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు సరిత, కార్యదర్శి ప్రగతి, కోశాధికారి సరిత ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు సీనియర్ నాయకుడి రాజీనామా

ధారూరు: అధికార పార్టీ బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు ఇబ్రహీం ఆదివారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మైనార్టీలను ఎమ్మెల్యే చిన్నచూపు చూడటం వలనే తప్పుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్నాళ్లు తనకు సహకరించిన మంత్రి మహేందర్‌రెడ్డి, జిల్లా చైర్ పర్సన్ సునీతారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సభకు తరలిన నాయకులు

బొంరాస్‌పేట: ప్రస్తుత ఎన్నికల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ సంఘం నియోజకవర్గ నాయకుడు మన్నె బస్వరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీల రాజకీయ రిజర్వేషన్ డిమాండ్లలో భాగంగా హైదరాబాద్ మున్నూరుకాపు భవన్‌లో నిర్వహించిన సభకు వెళ్లారు. ఇందులో వెంకటయ్య, రాఘవేందర్ యాదవ్, చౌడప్ప, సురేశ్, అనిల్ ఉన్నారు.

పనిచేసే వారిని గుర్తించాలి

కొడంగల్: బీజేపీ కొడంగల్ శాసనసభ టికెట్ బీసీలకు కేటాయించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కరెంటు రాములు కోరారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలో ఎంతో మంది బీసీ నేతలైన విద్యావంతులు బీజేపీలో పనిచేస్తున్నారని, అలాంటి వారిని అధిష్టానం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఇందులో పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కూర వెంకటయ్య, కొత్తపల్లి కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోలేని ఎమ్మెల్యే

కుల్కచర్ల: రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విఫలమయ్యారని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఘణపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల్కచర్ల మండలం అల్మాస్‌ఖాన్‌పేట్ భూముల్లో సాగుచేసుకుని జీవిస్తున్న రైతులకు.. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా.. సాగుచేస్తున్న వారికి పట్టాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే తహసీల్దార్‌తో చెప్పించారని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఆయన విఫలమయ్యారని విమర్శించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని ఎమ్మెల్యే.. ఓట్లు అడిగేందుకు ఇక్కడికి రావద్దని కోరారు.

31న తిరుమలకు భజనమండలి

కొడంగల్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని రుద్రారం వీరాంజనేయ భజనమండలి సభ్యులు చెప్పారు. స్థానిక వీరాంజనేయ దేవాలయంలో ప్రతి శనివారం, ముఖ్యమైన రోజుల్లో భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని పేర్కొన్నారు. 2012 అక్టోబర్ నుంచి 18మంది భజన మండలి సభ్యులు అఖండ పారాయణంలో పాల్గొన్నారు. అలా మొదలయి ఇప్పటివరకు 10 పర్యాయాలు కార్యక్రమంలో పాల్గొన్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 31న పారాయణంలో పాల్గొనేందుకు తిరుమలకు బయలు దేరనున్నట్లు సభ్యులు తెలిపారు.



తిరుమలలో రుద్రారం భజనమండలి సభ్యులు(ఫైల్)

బాబోయ్.. ఇదేం రోడ్డు?

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధి కొత్తగడి నుంచి బంగారు మైసమ్మ వరకు రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి వాహన చోదకులకు చుక్కలు చూపెడుతోంది. దీంతో కొందరు వాహనదారులు మాట్లాడుతూ బాబోయ్ ఇదేం రోడ్డు.. పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, వాహనాలు పాడవుతున్నాయని చెప్పారు. ఈ దారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయని, జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పయనిస్తుంటారని, కానీ రోడ్డు ఇంత దారుణంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవటం లేదని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.



రహదారి దుస్థితి

బీజేపీదే అధికారం

కల్వకుర్తి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గానుగుమార్లతండాకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా హరిప్రసాద్, శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగురవేస్తామని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు శంకర్‌నాయక్, బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యనాయక్, నాయకులు మోహన్‌రెడ్డి, డాక్టర్ రమేశ్, లక్ష్మణ్‌నాయక్, కుమార్, రాజు, మునేశ్, నాగార్జున్, వెంకటేశ్, రాజేశ్, నాగేశ్ తదితరులు ఉన్నారు.



హరిప్రసాద్, శంకర్‌నాయక్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

కేసీఆర్‌కు సాటిలేరు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని, గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్‌కు ఎవరూ సాటిలేరని మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జీవంతులు అన్నారు. ఆదివారం మండల పరిధి నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, టోల్‌కట్ట, కనకమామిడి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి, జీవంతులు ఆయా నాయకులతో కలిసి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనుకున్నది సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణ సాధనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మాటతప్పని నేత అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ని గెలిపించాలని వారు కోరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చెట్టుకింది ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్‌లు పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, గుండాల నవనీతారాజు, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవీందర్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, గణేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎంఎస్ రత్నం, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు

బీఆర్‌ఎస్‌లో చేరిక..

కనకమామిడి మాజీ సర్పంచ్ ఎంఎస్ రత్నం 30 మంది కార్యకర్తలతో బీఆర్‌ఎస్‌లో చేరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కుల్కచర్ల: పుష్కర కాలం అనంతరం కలుసుకున్న బాల్య స్నేహితులతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. చౌడాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు, నాటి ఉపాధ్యాయులు అందరూ ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ ప్రధానోపాధ్యాయుడు చెన్నకేశవ, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, అంజయ్య, వీరేశం, కృష్ణకుమార్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం, బాల్‌రాజ్, అరుణ, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

చేవెళ్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడిగా ఎండీ నవాబ్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపడం కోసం ఉద్యమించాలన్నారు.

అమలుకాని హామీలతో మోసం



దోమ: గూడూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దౌల్తాబాద్: తిమ్మాయిపల్లిలో..



బంట్వారం: తొర్మామిడిలో గ్యారంటీ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మొద్దు
- కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం నేతలు

దోమ/బంట్వారం/దోమ: అమలు సాధ్యం కాని హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టోలో పేర్కొంటూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆ పార్టీ శ్రేణులు అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి గ్యారంటీ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

బంట్వారంలో..

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని కోఆప్షన్ సభ్యుడు తౌఫిక్ ధీమా వ్యక్తం చేశారు. ఇంటింటికీ కాంగ్రెస్‌లో భాగంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. గత ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సీఎం కేసీఆర్ మాయ మాటలకు మరో సారి నమ్మి మోసపోవద్దని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోతో పాటు గ్యారంటీ పథకాలు అమలు అవుతాయని పేర్కొన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రసాద్ కుమార్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వికారాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఇందులో నాయకులు మున్నాబాయ్, సుదర్శన్, అజీమ్, గౌస్, వెంకటయ్య, సలీం ఉన్నారు.

దోమలో..

అధిష్టానం ప్రకటించిన పథకాలతో ప్రజలకు మేలు జరగనుందని, కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతుకుమార్ కోరారు. దోమ మండలం గూడూర్‌లో పలువురు నేతలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ దోపిడీ పెరిగిందని ఆరోపించారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు యాదవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

దౌల్తాబాద్‌లో..

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు కోరారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా తిమ్మాయిపల్లి, యాంకి, బాలంపేట గ్రామాల్లో ఆరు గ్యారంటీ కార్డుల ప్రచారం నిర్వహించారు.

రూ.500లకే గ్యాస్ సిలిండర్

మర్పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ఆ పార్టీ జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మర్పల్లి మండలం కోట్‌మర్పల్లిలో గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబానికి నెలకు రూ.2,500 నగదు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో పార్టీ మండల సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మహేందర్, గ్రామ కమిటీ నాయకులు ఉన్నారు.